క్లుప్తంగా

గొయ్యి పూడ్చారు...!



చేబ్రోలు రథం బాట వీధిలో ప్రమాదభరితంగా ఉన్న గొయ్యిని పూడ్చి వేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు రథం బాట వీధిలో ఇటీవల మంచినీటి పైపులైను మరమ్మతుల కోసం తవ్విన గోతిని మరమ్మతులు పూర్తయి వారం రోజులైనా దానిని పూడ్చిపెట్టకపోవడంతో స్థానికులకు అది ప్రాణసంకటంగా మారింది. ఈ విషయాన్ని ‘సాక్షి’ దినపత్రికలో ఆదమరిస్తే అంతే సంగతి అనే శీర్షికన గురువారం వెలువడడంతో అధికారులు స్పందించారు. గొల్లప్రోలు ఎంపీడీఓ ఆదేశాల మేరకు ఈఓపీఆర్‌డీ కుమార్ వెంటనే గొయ్యి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి గొయ్యిని పూడ్చి వేయించారు. స్థానికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

మహిళల హక్కులను పరిరక్షించాలి



సామర్లకోట జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో మాట్లాడుతున్న నూతలపాటి అప్పలకొండ

సామర్లకోట: మహిళల హక్కులను పరిరక్షించడానికి నిత్యం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. జిల్లా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏడాదికి ఒకసారి మహిళల గురించి గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చి తరువాత వారి హక్కులను విస్మరిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో మహిళలు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం యు.మీనామాధురి అధ్యక్షత వహించగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరికి వేత కారణంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణ పరిధి లోని మండలంలోని కొన్ని గ్రామాల్లోను విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రైల్వే స్టేషన్ ఏరియా, హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి.మేడపాడు, ఉండూరు, పెద్దాపురం మండలంలోని ఆర్బీపట్నం గ్రామాలకు, విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమానాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్ధక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876

బకాయిల భారం

- వసూలు చేయడంలో అధికారుల అశ్రద్ధ
- రూ.5.62 కోట్ల పన్ను బకాయిలు
- మున్సిపల్ షాపుల బకాయిలు రూ.72.97 లక్షలు



సామర్లకోట పట్టణం



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులు

సామర్లకోట: మున్సిపాలిటీ ఆదాయాలపై అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నుల బకాయిలు పెరిగిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తన్నట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దివంగత నేత డాక్టరు వైఎస్ రాజశేఖరరెడ్డి మున్సిపాలిటీలో పని చేసే వారికి 010 ఖాతా నుంచి ప్రతి నెలా జీతాలు చెల్లించేలా సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. దాంతో మున్సిపల్ ఉద్యోగులు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు తీసుకుంటారు. అంతకు ముందు ఐదు నెలల నుంచి ఏడు నెలల వరకు జీతాల బకాయిలు ఉండేవి. మున్సిపాలిటీకి వసూలు అయిన పన్నులతో వారికి జీతాలు చెల్లించేవారు. దాంతో పన్నులపై అప్పట్లో ఉద్యోగుల ప్రత్యేక శ్రద్ధ చూపే వారని, ప్రస్తుతం ప్రతి నెల వారికి జీతాలు రావడంతో బకాయిలపై శ్రద్ధ చూపడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

పన్నుల బకాయిలు

మున్సిపాలిటీ పరిధిలోని 14,672 ఇళ్ల నుంచి రూ.2,28,96000, అలాగే 2,163 ఖాళీ స్థలాల నుంచి రూ.2,16,70,000, కోర్టు కేసులో ఉన్న బకాయిలు రూ. 28వేలు ఉన్నట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారులు తెలిపారు. అదే విధంగా 152 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.01,21,68,000 బకాయిలు ఉన్నాయి. మూడు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.3,23,000 బకాయిలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు ధ్రువీకరించారు. వీటిలో విస్తరణ శిక్షణ కేంద్రం బకాయి రూ.39 లక్షలు కాగ అపరాధ రుసంగా రూ.98 లక్షలు విధించినట్టు రెవెన్యూ అధికారులు చెప్పారు.

మున్సిపల్ షాపుల నుంచి..

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న షాపుల బకాయిలు వసూలు చేయడంలో అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు వచ్చిన వెంటనే గడువు తేదీ లోపుగా చెల్లిస్తున్న వినియోగదారులు మున్సిపల్ షాపుల అద్దెలు, ఇంటి అద్దెలు చెల్లించడంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదనే ప్రశ్నలు జోరుగా ఉన్నాయి. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపుల నుంచి రూ.41,27,924, సంత మార్కెట్‌లో షాపుల నుంచి రూ.1,85,592, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని షాపుల నుంచి రూ.2,60,909, బళ్లమార్కెట్ షాపుల నుంచి రూ.5,39,288, నూకాలమ్మ ఆలయం వద్ద షాపుల నుంచి రూ.8,27,945, తిలక్‌చౌక్‌లోని షాపుల నుంచి రూ.12,34,051. కొత్తూరు మార్కెట్‌లోని షాపుల నుంచి రూ.రూ.1,21,291 బకాయి ఉన్నట్టు మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్యామల తెలిపారు.

వసూలుపై అశ్రద్ధ



మున్సిపాలిటీలో సాధారణ నిధులు పెంచుకునేలా అధికారులు పన్నులు, అద్దెలను వసూలు చేయాలి. మున్సిపల్ అధికారులకు ప్రతి నెలా జీతాలు అందడంతో బకాయిలపై శ్రద్ధ తగ్గిపోయింది. ఆదాయం వస్తున్న పెట్రోలు బంకు, ఒక ప్రైవేటు విద్యా సంస్థ భారీ మొత్తంలో బకాయిలు ఉన్నా ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదు. మున్సిపల్ ఆధాయం పెరిగితే ప్రజల అవసరాలు తీర్చడానికి నిధులు ఖర్చు చేసే అవకాశం ఉంటుంది.

– ఆవాల లక్ష్మీనారాయణ, సీనియర్ కౌన్సిలర్, సామర్లకోట

ప్రత్యేక చర్యలు తీసుకున్నాం



మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, ఖాళీ స్థలం, కుళాయి పన్నులు మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశాం. అయినా బకాయిలు చెల్లించక పోతే ఇంటి కుళాయి కనెక్షన్ తొలగిస్తాం. ఖాళీ స్థలాలు కలిగిన యజమానులు ఇతర ప్రాంతాల్లో ఉండడం వలన పన్నులు చెల్లించడం లేదు. వాటిని గుర్తించి పన్నులు చెల్లించక పోతే జప్తు చేసిన స్థలాలను స్వాధీనం చేసుకొంటాం. ఏడీబీ రోడ్డులోని పెట్రోలు బంకు యజమానికి నోటీసు జారీ చేశాం. అవసరం అయితే పెట్రోలు బంకు ఆస్తులను కూడా జప్తు చేస్తాం. అదే విధంగా దుర్గాప్రసాద్ పబ్లిక్ స్కూల్ భారీ మొత్తంలో బకాయి ఉంది. ఆ స్కూల్‌కు నోటీసులు ఇచ్చాం. ఖాళీ స్థలాల బకాయిలపై నోటీసు బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా ఆ స్థలాలు అమ్మకాలు నిలిచి పోయే విధంగా చేస్తున్నాం. బకాయిలపై వడ్డీ పడుతుంది. ప్రజలు గమనించాలి. సకాలం లో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి.

– ఎ.శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం ద్వారా సమాజంలో శాంతి నెలకొల్పడానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. ఆమె గురువారం గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో భద్రావతి సమేత భావనఋషి విగ్రహ పునఃప్రతిష్టా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె భద్రావతి సమేత భావనఋషిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈమె వెంట గొల్లప్రోలుకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఉన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

పిఠాపురం: ఈ నెల ఎనిమిదో తేదీన పట్టణంలోని 12వ అదనపు జిల్లా జడ్జి కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎ.వాసంతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనిలో భాగంగా విచారణలో ఉన్న కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకొనేలా కక్షిదారులకు వీలు కల్పించినట్టు ఆమె సూచించారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాజీ పడతగినటువంటి సివిల్, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, కుటుంబ తగాదాలుకు సంబంధించిన కేసులు, పీఎల్సీ కేసులు ఈ జాతీయ లోక్ అదాలతో పరిష్కరించుకొని తమ విలువైన సమయాన్ని, డబ్బుని వృథా కాకుండా సత్వర న్యాయం పొందాలని ఆమె కోరారు.

పాడా కార్యాలయం పనులు సకాలంలో పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ షణ్మోహన్



పనులు పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా) తాత్కాలిక భావన ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న పాడా కార్యాలయ పనులను గురువారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం పరిధిలోని ప్రాంతాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు.ఈ పనుల పర్యవేక్షించేందుకు పిఠాపురంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో పాడా కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పాడా ఇన్‌చార్జి పీడీ ఎన్.శ్రీధర్ బాబు, ఏపీడీ పి.వసంత మాధవి, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ కనకారావు ఇతర ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల ఆక్రమణ



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- పూడిక తీసే అవకాశం లేక... రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సామర్లకోట: స్థానిక బ్రౌన్‌పేటలో డ్రైన్లు ఆక్రమణ చేయడంతో డ్రైన్లల్లో పూడిక పెరిగిపోయినా తీయడానికి అవకాశం లేకుండాపోయింది. దాంతో డ్రైనులోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. బ్రౌన్‌పేటలోని అంబేడ్కర్ పార్కు నుంచి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డులో డ్రైను ఆక్రమణలకు గురైంది. రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీటిని దాటి ఆ ప్రాంత ప్రజలు, బాలికలు పాఠశాలకు రాక పోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు డ్రైన్లపై ఆక్రమణలను తొలగించి డ్రైనేజీ సదుపాయాన్ని మెరుగు పర్చాలని స్థానికులు కోరుతున్నారు. వేసవిలోనే డ్రైనేజీలో నీరు రోడ్లపై ప్రవహిస్తే వర్షా కాలంలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

గడియారం స్తంభం పనుల పరిశీలన



గడియారం స్తంభం పనులను పరిశీలించిన కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న గడియారం స్తంభం పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పరిశీలించారు. పనులు పూర్తి కావడంతో గడియారం స్తంభంలో లోపలి భాగంగా ఆకుపచ్చరంగు గడ్డితో పాటు మంచి మొక్కలు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టరు శ్రీకాంత్‌కు సూచించారు. అదే విధంగా మొక్కలపై నీరు పడేలా వాటర్‌పాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐ లవ్ సామర్లకోట అనే పేరును రైల్వేస్టేషన్ నుంచి వచ్చే వారికి కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఎం.రమేష్‌బాబు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ఆందోళనను అడ్డుకున్న పోలీసులు

కాకినాడ సిటీ: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, పని భారం తగ్గించాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. రైళ్లు, బస్సుల నుంచి టికెట్లు కొనుగోలు చేసి వెళ్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. దీనికి వ్యతిరేకంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద గురువారం ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి బేబీరాణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గత ఆరు ఏళ్ల నుంచి వేతనాలు పెంచలేదని, నిత్యావసర సరకుల ధరలు ఏటా పెరిగిపోతున్నాయన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా ఉందన్నారు. కనీస వేతనాలు రూ. 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశా కార్యకర్తల శాంతియుత ఆందోళనను విచ్ఛిన్నం చేయడానికి చర్యలు జరుపుతున్నట్లు నటిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాప, మణి, సత్యవతి, ధనలక్ష్మి, కృపారాణి పాల్గొన్నారు.

నాగార్జున చెరువులో చేపల వేట ప్రారంభం



సామర్లకోట నాగార్జున చెరువులో ప్రారంభమైన చేపల వేట

సామర్లకోట: ప్రతి ఏడాది నాగార్జున చెరువులో ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే చేపల వేట ప్రస్తుతం మార్చిలో మొదలైంది. ఉండూరు రైల్వే గేటు వద్ద సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ హెల్త్ ఆధ్వర్యంలో చెరువును తవ్వి కాకినాడ నాగార్జున ఫ్యాక్టరీకి చెరువులో నీరు వాడకం హక్కు కల్పించారు. తదుపరి 2000 సంవత్సరంలో ఈ చెరువులో నీటిని తాగునీటిగా ఉపయోగించడానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దాంతో నాగార్జున చెరువును తాగునీటి చెరువుగా గుర్తింపు పొందింది. అయితే పబ్లిక్ హెల్త్ అధికారులు అనుమతితో మత్స్యకార సంఘ నాయకులు ఈ చెరువులో చేపలు పెంచుతూ ప్రతి ఏడాది చేపల వేట సాగిస్తున్నారు. ఈ తాగునీటి చెరువులో బుధవారం నుంచి చేపల వేట ప్రారంభించారు. దాంతో చెరువులో నీరు కలుషితం అయిపోతుందని, చేపలు పెంచడానికి వీలులేదని మానవహక్కుల సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, కుంచే నానిబాబులు డిమాండ్ చేస్తున్నారు. తాగునీటి చెరువులో చేపల వేట సాగించడానికి వీలు లేదని మానవహక్కుల సంఘ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. కలుషితమైన నీటి వలన ప్రజలు అనారోగ్యానికి గురి అయితే అధికారులే బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను వివరణ కోరగా నాగార్జున ఫిల్టరు చెరువులో నీరు ఆకుపచ్చ రంగులోనికి మారిపోవడంతో ఆ చెరువులో నీటిని తాగునీటిగా ఉపయోగించడం లేదన్నారు. ఈ మేరకు కలెక్టరు చెరువులో చేపలను పట్టుకున్న తరువాత నీటిని పూర్తిగా తీసి వేసి కొత్త నీటితో చెరువును నింపాలని సూచించారన్నారన్నారు. దాంతో చెరువులో చేపల వేట జరుగుతుందని చెప్పారు. ఈనెల 10వ తేదీలోపు చేపల వేట పూర్తి చేయాలని మత్స్య కార సంఘ నాయకులకు సూచించారన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చెరువులోనికి వచ్చే నీటిని బైపాస్ మార్గంలో ఫిల్టర్ బెడ్‌లోనికి మళ్లించి తాగునీరు అందించాలన్నారు. చెరువులో నీటిని తీసి వేసిన తరువాత గోదావరి కాలువలోని నీటితో నింపి అప్పటి నుంచి చేపల పెంపకం పూర్తిగా నిషేధించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

రైతులకు సాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ: తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో వరి పొలాలకు సాగునీరు అందించాలని కోరిన రైతులకు తగిన ఏర్పాట్లు చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాంట్ గ్రామానికి వంతుల వారీగా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ నీటిని ఎగువన ఉన్న రైతులు ఇంజిన్లు, మోటార్లతో తోడినా, అక్రమంగా దారి మళ్లించినా, కాలువలకు గండ్లు కొట్టినా వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సంబంధిత అధికారుల విధులకు ఆటంకం కలిగించినా, అరెస్టు చేస్తామని హెచ్చరించారు. గ్రాంటు గ్రామానికి వెళ్లే నీరును ఎవరైనా అక్రమంగా వినియోగించినా, ఇంజనులతో తోడినా, దారి మళ్లించినా చూసిన వారు కలెక్టర్ 7993332244 నంబర్‌కు వాట్సప్ ద్వారా సమాచారం అందించాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు.

వైభవంగా నాగేశ్వరస్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణా సమేత నాగేశ్వర స్వామి వారి దివ్య వార్షిక కల్యాణం గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆకొండి వేంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకర శాస్త్రీ స్వామి వారి దివ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు, నాగేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, అపర్ణా దేవి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేసిన అర్చకులు సాయంత్రం లక్ష్మీ గణపతి హోమం, అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని తిలకించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆకర్షణీయంగా సూర్యారావుపేట బీచ్

- కలెక్టర్ షణ్మోహన్
- అధికారులతో కలిసి పరిశీలన
- క్లీనింగ్ పనులపై ఆగ్రహం



బీచ్‌లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ రూరల్: సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్, పరిసరాలు ఆకర్షణీయంగా ఉన్నాయని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. బీచ్‌లో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. పర్యాటక, కాకినాడ నగరపాలక సంస్థ, పంచాయతీ, కొడా తదితర శాఖల అధికారులతో కలిసి కలెక్టరు పర్యటించి సముద్ర తీర ప్రాంతంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలు, బీచ్ క్లీనింగ్, నూతనంగా చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. నెల రోజుల్లో బీచ్ సుందరీకరణ పనుల పూర్తి చేసి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాన్నారు. బీచ్ క్లీనింగ్ అధ్వానంగా ఉండడంతో సంబంధిత అధికారులు, ఆపరేటరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరు షణ్మోహన్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుకు మెరగైన సౌకర్యాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి చేపట్టిందన్నారు. అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేస్తూ బీచ్ సుందరీకరణ పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. బీచ్ పరిసరాలలో ప్లాస్టిక్, తూటు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించి, క్లీన్ అండ్ గ్రీన్‌గా బీచ్ పార్కు ఉండేలా చూడాలన్నారు. కలెక్టరుతో పాటు జిల్లా తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈ కామేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.పోశయ్య, అసిస్టెంట్ టూరిజం అధికారి వి.త్రిమూర్తులు, ఏపీటీడీసీ ఏఈ వెంకటేష్, కొడా ఈఈ రామారావు, జిల్లా పంచాయతీ సిబ్బంది, కొడా ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



నాగులపల్లిలో ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: అగ్ని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని ఆదుకోవాలని సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణ రెడ్డి అన్నారు. నాగులపల్లికి చెందిన అనిశెట్టి రామ కృష్ణారెడ్డి, కుత సుబ్బిరెడ్డి, అనిశెట్టి దుర్గాలక్ష్మి, చింతపల్లి ధనలక్ష్మీలు నివసిస్తున్న తాటాకుపాక ప్రమాదవశాత్త కాలిపోయింది. దీంతో గురువారం బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి నత్యవసర వస్తువుల, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి లక్ష్మీగోపాల్‌రెడ్డి, వడిశెట్టి రామకృష్ణారెడ్డి, అబ్బిరెడ్డి సుబ్బిరెడ్డి, చింతపల్లి సత్యనారాయణ, గుర్రాల కల్యాణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

11 మంది గైర్హాజరు

కొత్తపల్లి: వీవీఎస్ విద్యాసంస్థల కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 11 విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.సతీష్‌కన్నా తెలిపారు. మొత్తం 282 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావల్సి ఉండగా 271 మంది హాజరుకాగా 11 గైర్హాజరయ్యారన్నారు.